ప్రజాశక్తి





శుక్రవారం 18 ఏప్రిల్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

భూ విక్రయాల్లో మందగమనం

● రాజధానిలో భారీగా ధరల పెరుగుదలతో వెనుకంజ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని గ్రామాల్లో క్రయ విక్రయాలు మందగించాయి. ఒక వైపు రాజధాని గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభం అవుతున్న వేళ భూముల కొనుగోలు మందగించడం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులను కలవరపరుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని పనులు వేగం పుంజుకున్నాయి. ఇదే సమయంలో తమ భూములకు మంచి ధరలు వస్తాయని రాజధాని గ్రామాల రైతులు భావించారు. కానీ పరిస్థితి తలకిందులైంది. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రాజధాని గ్రామాల్లో క్రయ విక్రయాలు మందగించడంతో రైతులల్లో కంగారు మొదలైంది. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాజధాని అమరావతి అభివృద్ధి వేగం పుంజుకుంటుందని భావించి ఆయా గ్రామాల్లో భూముల ధరలను భారీగా పెంచారు. కొంతమంది వ్యాపారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, డాక్టర్లు, నల్లధనం కలిగిన వారు రాజధాని గ్రామాల్లో స్థలాలు కొనుగోలుకు ఆసక్తి చూపారు. రాజధాని అభివృద్ధిపై ప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తుండటంతో రియల్టర్ల మొత్తం ఒక్కసారిగా రాజధాని గ్రామాలకు వచ్చారు. జులై నుంచి సెప్టెంబరు వరకు ఒక మోస్తరుగా లావాదేవీలు జరిగాయి. అక్టోబరు నుంచి పూర్తిగా మందగించాయి. రాజధాని గ్రామాల్లో గజం రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు చెప్పడంతో కొనుగోలు దారులు వెనుకంజ వేశారు. ఇంత ధర పెడితే అభివృద్ధి చెందిన గుంటూరు, విజయవాడ నగరాల్లోనే స్థలాలు వస్తున్నాయని భావించి కొనుగోలు దారులు వెనక్కి తగ్గారు.అంతేగాక రాజధానికి సమీపంలో ఉన్న బౌద్ధారామం అమరావతి, క్రోసూరు, సత్తెనపల్లి, గుంటూరు రూరల్, తాడికొండ, పెదకాకాని, మంగళగిరి మండలాలతో పాటు ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపారు. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడం, జనసాంధ్రత పెరగాలంటే కనీసం ఐదు నుంచి 10 ఏళ్లు వేచిచూడక తప్పదని, ఈ లోగా అమరావతి పరిసరాలు ఇప్పటికే అభివృద్ధి చెంది ఉండటంతో కొనుగోలుదారులు ఆయా ప్రాంతాలపై దృష్టిసారించారు. రాజధానిలో గతంలో ఉన్న ధరలను రెట్టింపు చేయడంతో కొనుగోలు దారులు ఒక్కసారిగా పునరాలోచనలో పడ్డారు. కేవలం హడావుడిగా వచ్చి చూసి వెళ్లే వారి సంఖ్య పెరగడమే తప్ప రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఈనేపథ్యంలో రాజధాని పరిసరాల్లోనే ఎక్కువగా క్రయ వికయాలు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం రాజధాని



విస్తరణ, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు పేరుతో మరో 44 వేల ఎకరాలు భూ సమీకరణ ద్వారా తీసుకోవాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు రావడంతో తాడికొండ, అమరావతి, మేడికొండూరు, పెదకాకాని మండలాల్లో అలజడి ప్రారంభం అయింది.

రాజధానిలో రిజిస్ట్రేషన్లు తగ్గుదల

గుంటూరు జిల్లాలో రిజిస్ట్రేషన్లు ద్వారా 2024-25లో రూ. 1166.77 కోట్లు ఆదాయం రావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా రూ.971.89 కోట్లు వచ్చాయని, మొత్తం 1,34,335 రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ తెలిపారు. జిల్లా అంతటా రిజిస్ట్రేషన్లు పుంజుకున్నా రాజధాని గ్రామాల్లో మాత్రం నెమ్మదిగా జరుగుతున్నాయని వెల్లడించారు. అనంతవరం, మందడం, తుళ్లూరు రిజిస్ట్రేషన్లు కార్యాలయం పరిధిలో లావాదేవీలు మందగమనంగా సాగుతున్నాయన్నారు. అనంతవరం రూ.32.15 కోట్ల ఆదాయం రావాలని లక్ష్యంగా నిర్ణయించగా గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.22.44 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. అనంతవరంలో రూ.6.08 కోట్లకు గాను రూ.3.54 కోట్ల ఆదాయం వచ్చింది. అలాగే తుళ్లూరు కార్యాలయంలో రూ.16.89 కోట్ల గాను రూ.18.73 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.

త్వరలో మహానాడు ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభం

● మంత్రి నారాయణ వెల్లడి

● విజయవాడలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష

● స్టార్మ్ వాటర్ డ్రైనేజీకి సిఆర్‌డిఎ నుండి రూ.200 కోట్లు ?



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకు త్వరలో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభమవుతుందని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. అందువల్ల నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ రహదారులను ఎంపిక చేసి కొత్తగా రోడ్లు వేయాలని సూచించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివద్ధి పనులపై మంత్రి నారాయణ గురువారం సమీక్షించారు. నగరంలోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంఎల్‌ఎలు బోండా ఉమా, గద్దె రామమోహన్, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మిశ, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర, టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత, ప్రజారోగ్యవిభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న, విఎంసి చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, జాతీయ రహదారులు, రైల్వే, ఆటోనగర్ ఐలా తదితర శాఖలకు చెందిన ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈసమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి విజయవాడ నగరంలో అన్ని వరద నీటి కాల్వల పూడికతీతతోపాటు మరమ్మతులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీటి కాల్వల పనులు వెంటనే చేపట్టాలన్నారు. మెప్మాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరంలో పార్కులు, రోడ్లు, ఇతర వసతుల కల్పనపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. నగరంలో నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు రోడ్ల కనెక్టివిటీ పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే (మిగతా 2లో)

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.గోపి బాధ్యతలు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్



కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.గోపి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో తన ఛాంబర్లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కెయులో ఊడిపడ్డ సీలింగ్

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియం సీలింగ్ ఊడిపడింది. ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఊడిపడడంతో ప్రమాదం తప్పింది. ఈనెల 15 నుండి 17వ తేదీ వరకు ఈ వర్సిటీ ఆడిటోరియంలో మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పలువురికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే చివరి రోజు గురువారంనాడు తరగతులు నిర్వహించేందుకు ఆడిటోరియం తలుపులు తెరిచిచూసే సరికి ఒకపక్కన సీలింగ్ ఊడిపడి ఉంది. దీంతో అధికారులు ఈ శిక్షణా తరగతులను రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలోకి మార్పు చేశారు. తరగతులు జరిగే సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే పలువురు గాయపడేవారు. ఇప్పుడు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో వర్సిటీ యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, మైక్రోసాఫ్ట్ సంస్థతో చేసుకున్న అవగాహనా ఒప్పందంలో భాగంగా మూడు రోజులు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంసిఎ, ఎంబిఎ, ఎంఎస్‌సి తదితర పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు కష్ణ ద్వివేది, సచిన్ చౌహాన్‌లతో ఉద్యోగ, ఉపాధి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. 2021లోనే ఈ ఆడిటోరియాన్ని నాసిరకం మెటీరియల్‌తో నిర్మించడంతో కుప్పకూలిందని పలువురు తెలిపారు.

సంచుల కొరత లేకుండా చర్యలు

మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కంకిపాడు : రబీ ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. దాళ్వాలో 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.590 కోట్లను ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు చెల్లించిందని తెలిపారు. ఈసారి ధాన్యం ఉత్పత్తి బాగా పెరిగిందని, దీంతో గోతాం సంచుల కొరత ఏర్పడిందని చెప్పారు. గతంలో వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 35 సంచులు ఇస్తున్నామని, ఈసారి దిగుబడి పెరగడంతో రైతుల అవసరాలను బట్టి 70 సంచుల సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి నాదెండ్ల గురువారం... రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలాని సమూన్, కష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కృష్ణాజిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, (మిగతా 2లో)



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రాజధాని అభివృద్ధికి సమన్వయంతో కృషి

● సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు

ప్రజాశక్తి-గుంటూరు : రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు, అభివద్ధి కార్యక్రమాలు జరుగనున్న దష్ట్యా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్డీఏ కమిషనర్ కె. కన్నబాబు ఆదేశించారు. గురువారం కలక్టరేట్‌లో కన్నబాబు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ , నగర కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి సీఆర్డీఏ పరిధిలో నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కన్నబాబు మాట్లాడుతూ సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ఇతర విభాగాల పనులు పున:ప్రారంభం కానున్నాయని (మిగతా 2లో)

రూ.800 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రాలు

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - ఉయ్యూరు : కష్ణాజిల్లాలో రూ.800 కోట్ల వ్యయంతో పలు సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంత్రి గొట్టిపాటి... గురువారం మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్‌తో కలిసి పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరులో టిడ్కో గహ సముదాయం వద్ద రూ.4.36 కోట్లతో నిర్మించిన 33/11 కెవి అవుట్‌డోర్ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఉయ్యూరులోని టిడ్కో గహాలు, శ్రీనివాస్‌నగర్, సౌభాగ్యనగర్, శాంతినగర్, వివేకానంద నగర్ ప్రాంతాలకు అవసరమైన విద్యుత్తును ప్రస్తుత విద్యుత్ ఉపకేంద్రం నుండి సరఫరా చేస్తామన్నారు. ఉయ్యూరులోనే మరో 132 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి గతంలో (మిగతా 2లో)



సభలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రైవేటు బస్సులో మంటలు

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ బస్టాండ్ వద్ద ఓ ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో బస్సు లోపల సీటింగ్, ఇంటీరియర్ విభాగం మొత్తం దగ్ధమైంది. కృష్ణలంక పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... విజయవాడ సమీపంలోని కానూరుకు చెందిన ఎవిఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గురువారం 5.30 గంటల సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు స్థానిక పిఎన్ బస్‌స్టేషన్ ఔట్ గేట్ ప్రధాన రహదారి పక్కన డ్రైవర్ ఎం.నాగేశ్వరరావు పార్కింగ్ చేశాడు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ అయిన హైదరాబాద్‌లోని ప్రయాణీకులను ఎక్కించుకొని రావడానికి వెళ్తున్న క్రమంలో కొంత మందిని ఇక్కడ నుంచి ఎక్కించుకుందామనే ఆలోచనతో డ్రైవర్ నాగేశ్వరరావు రోడ్డు పక్కన బస్సును ఆపాడు. ఈ సమయంలో బస్సు ఎసికున్న గ్యాస్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమై ఒక్కసారిగా బస్సులో నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్, కండెక్టర్ వెల్లంకి రాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి వచ్చే లోపే బస్సు లోపల సీటింగ్, ఇంటీరియర్ విభాగం మొత్తం దెబ్బతిన్నది. బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రద్దీ ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో ఆర్టీసి సర్వీసులతోపాటు ఇతర వాహనాలు భారీ సంఖ్యలో రహదారికిరువైపులా నిలిచిపోయాయి. సుమారు గంట సేపు ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రమాదంలో బస్సు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ధర్నాలో కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ (వాటర్ ,పార్కు, వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్ ,టౌన్ ప్లానింగ్) కార్మికులకు జీతాలు పెంచాలని, 60 సంవత్సరాలు నిండాయని ఆపిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ వద్ద యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో నగర గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ గత నెల జీతం ఇంకా పడకపోవడం వల్ల మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కనీసం ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు కట్టుకోలేక రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని వెంటనే ఈనెల 20 లోపు మార్చి నెల జీతం వేయకపోతే పని బంద్ చేస్తామని అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, 60 సంవత్సరాలు నిండాయని తొలగించిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని, లేదా వారి కుటుంబంలోని పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ (వాటర్,పార్కు,వెహికల్ డిపో మెఖానిక్లు స్ట్రీట్ లైటింగ్ టౌన్ ప్లానింగ్)కార్మికులకు జీతాలు పెరుగుతాయని ఎంతో ఆశతో ఎదురు చూశారని, కానీ వారి ఆశలను వమ్ము చేస్తున్నారని విమర్శించారు. డెత్, సిక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అన్ని విభాగాల్లో మూడు షిఫ్ట విధానాన్ని అమలు చేయాలని వర్కర్లను పెంచాలని కోరారు. గత సమ్మె కాలపు ఒప్పంద జీవో కాపీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ ఐడెంటి కార్డులు ఇవ్వని సెక్షన్ విభాగాలన్నిటి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ త్రినాథ రెడ్డికి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబు శ్రీనివాసరావుకు, పార్క్ సెక్షన్ ఎడిహెచ్ఒ, ఏవోకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కారక్రమంలో ఇంకా యూనియన్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి. ప్రవీణ్, నగర కోశాధికారి డి స్టీఫెన్ బాబు, నగర ఉపాధ్యక్షురాలు టీ తిరపతమ్మ, విజయలక్ష్మి, కష్ణవేణి, పార్క్ సెక్షన్ బాధ్యులు టీ చిన్న, వెంకట్రావు, స్వరూప, వెహికల్ డిపో ప్రధాన కార్యదర్శి జి నాగరాజు,వీరబాబు,బి.రవి,వాటర్ సెక్షన్ బాధ్యులు వి సైదులు, ఎం.దుర్గారావు ,జయపాల్,మెకానిక్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు,సేలం దాసు, వి సాంబులు డ్రైనేజీ సెక్షన్ బాధ్యులు జయరావు, షరీఫ్ పాల్గొన్నారు.

24న ధర్నా జయప్రదం కోరుతూ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈనెల 24న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. విజయవాడలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని తాపీ కార్మికుల అడ్డా వద్ద గురువారం ధర్నాను విజయవంతం కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విజయవాడ తూర్పు నగర అధ్యక్షులు విబి రాజు, వి శ్రీను, బి సింహాచలం, పి ఆదినారాయణ, కే శివయ్య బి సత్యనారాయణ పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి



సమావేశంలో మాట్లాడుతున్న సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు

రాజధాని అభివృద్ధికి సమన్వయంతో కృషి

చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో చేపట్టనున్న నిర్మాణాలకు వచ్చే కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, ఆసాంఘిక శక్తుల నుండి కార్మికులకు రక్షణ కల్పించే విధంగా పోలీసు శాఖ చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రాజధాని పరిధిలోని పిహెచ్‌సిని 30 పడకల ఆసుపత్రిగా అప్డేట్ చేయడం జరిగిందని, కార్మికులకు అవసరమైన వైద్య చికిత్స అందించడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి కమిషనర్‌కు తెలిపారు. నిర్మాణ పనులకు కార్మికులు కుటుంబాలతో పనులకు వస్తారు కాబట్టి వారి కుటుంబాలలోని చదువుకునే పిల్లలను దగ్గరలోని స్కూల్స్‌లలో, పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ పీడీ , డిఇఒకి సూచించారు. నిర్మాణ రంగానికి సంబంధించి కాంట్రాక్టర్ల నియామకం ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనల మేర భవన నిర్మాణాలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ భవన నిర్మాణం జరిగే ప్రదేశాలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులకు చట్టపరంగా అందించాల్సిన సౌకర్యాలపై దష్టి పెట్టాలన్నారు. నిర్మాణ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ చక్కగా చేపట్టలని డిపిఓకు సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు కాంట్రాక్టర్లతో మాట్లాడి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరమైన మెటీరీయల్ అందేలా భూగర్భ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్ఒ ఎన్.ఎస్. కె. ఖాజావలి, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, డిఇఓ రేణుక , జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో మహానాడు ఫ్లైవోవర్ నిర్మాణం ప్రారంభం

ట్రాఫిక్ మళ్లింపు కొరకు పలు రహదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

స్ట్రామ్ వాటర్ డ్రైనేజీకి రూ.200 కోట్లు ?

నగరంలో దీర్ఘకాలంగా నిలిచిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పథకం పెండింగ్ పనులు పూర్తికి సిఆర్‌డిఎ నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ నిర్ణయించినట్లు తెలిసింది. రూ.461 కోట్ల అంచనాతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పథకం పనులు సగం కూడా పూర్తి కాకుండానే ఏళ్ల తరబడి ఆగిపోవడం, దీనికి సంబంధిచిన రూ.289 కోట్లను గత వైసిపి ప్రభుత్వంలో వేరే అవసరాలకు మళ్లించడం, ఆ నిధులకు నేటికీ కూడా అతీగతీ లేకపోవడం, డ్రైనేజీ సమస్యతో వర్షాలు వచ్చిన ప్రతిసారీ నగరం నీటి ముంపునకు గురికావడం వంటి సమస్యలు నెలకొన్న నేపథ్యంలో వరద నీటి కాల్వల పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకుగాను రూ.200 కోట్లను సిఆర్‌డిఎ నిధులు కేటాయించాలని సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబును మంత్రి నారాయణ ఆదేశించినట్లు తెలిసింది. ఈ పనులను త్వరగా ప్రారంభించేందుకు విఎంసి కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ నిర్మాణం, గుణదల ఫ్లైఓవర్, వాంబేకాలనీ ఆర్‌యుబి, అమృత్ స్కీమ్ కింద సింగ్‌నగర్‌లో ఎస్‌టిపి సంప్ ఏర్పాటు, రైతు బజార్, ఫుడ్ కోర్టు తదితర పలు ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. రాణిగారితోటలో జాతీయ రహదారికి ఆర్‌యుబిని నిర్మించే అంశం కూడా చర్చించినట్లు తెలిసింది. ఎపిఐఐసి కాలనీ, ఆటో నగర్, డంపింగ్ యార్డు, కాంపాక్టర్ వెహికల్, మురికివాడల్లోని వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు సమస్య, విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణంలో ఆక్రమణల తొలగింపు, స్థల సేకరణకు ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కరించాల్సిన సమస్యలను ప్రజాప్రతినిధులు మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. అలాగే విజయవాడ చుట్టుపక్కల జాతీయ రహదారికి అప్రోచ్ రోడ్లు నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టులపై చర్చించినట్లు తెలిసింది. తొలుత విఎంసిలో జరగాల్సిన ఈ సమావేశం ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయనే పేరుతో అప్పటికప్పుడే సిఆర్‌డిఎకు మార్పు చేయడం గమనార్హం.

రూ.800 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రాలు

శంకుస్థాపన చేసి మధ్యలో వదిలేశారని శాసనసభ్యులు చెబుతున్నారని, దానికి సంబంధించి కూడా శాఖ పరంగా ఫీజిబిలిటీ నివేదికను తెప్పించుకొని నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెడన నియోజకవర్గంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోను పలు విద్యుత్ ఉప కేంద్రాలు కావాలని కోరుతున్నారన్నారు. బందరు ఓడరేవు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, దాని కార్యకలాపాలకు విద్యుత్ అవసరాలు చాలా ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కష్ణాజిల్లాలో రూ.800 కోట్లతో వివిధ రకాల విద్యుత్ ఉపకేంద్రాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సంవత్సరం విద్యుత్ వినియోగం 6 నుంచి 8 శాతం పెరుగుతోందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను దష్టిలో ఉంచుకుని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో 400 కెవి గెస్సోలిన్ విద్యుత్ ఉప కేంద్రాన్ని రూ.6 వేల కోట్లతో నూతన సాంకేతికతను ఉపయోగించుకొని 80 ఎకరాలకు బదులుగా కేవలం 8 ఎకరాల్లోనే శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఎంపి బాలశౌరి మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడలో 230 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బందరు ఓడరేవు వద్ద 132, 220, కెవి విద్యుత్ ఉప కేంద్రాల అవసరం చాలా ఉందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంఎల్ఎ బోడే ప్రసాద్ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన 132 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. ఈ కేంద్రం పూర్తయితే ఇంకా రెండు మూడు మండలాల ప్రజలకు విద్యుత్ సమస్యలు తప్పుతాయన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వస్తే విజయవాడ, గంగూరు, పామర్రు విద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్తు సరఫరా చేయాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గంలో 2500 టిడ్కో గహాల నిర్మాణం చేపట్టామని, వీటిలో 90 శాతం గృహాల నిర్మాణం పూర్తయిందని, వచ్చే మూడు నెలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.26 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టి పలు గ్రామాలను అభివద్ధి చేశామన్నారు. ఉయ్యూరు పట్టణంలో రూ.27 కోట్లతో వేగంగా అభివద్ధి పనులు జరిగాయన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో పనులు జరిగాయన్నారు. మరో రూ.20 కోట్లతో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యానందం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దారు సురేష్, విద్యుత్ ఇఇలు కష్ణా నాయక్, సుధా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంచుల కొరత లేకుండా చర్యలు

ధాన్యం ఆరబెట్టు కేంద్రాన్ని, బాలాజీ మిల్లును, పెనమలూరు మండలం వణుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. పునాదిపాడులో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గోతాం సంచుల కొరత ఉందని, తగినన్ని సరఫరా చేయాలని మంత్రికి రైతులు విజ్ఞప్తి చేవారు. టార్ఫాలిన్ పట్టలు సరఫరా చేయాలని, రవాణా కిరాయి డబ్బులు రావాలని విన్నవించారు. తమకు ఇచ్చిన 600 గోతం సంచుల్లో 100 సంచులు దెబ్బతిన్నాయని చెప్పారు. సరైన గోతాలు ఇవ్వాలని, ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సంచుల సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్లాట్ ఫారాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బాలాజీ మిల్లుపై వస్తున్న ఫిర్యాదులను సరిచేసుకోవాలని మిల్లు యజమాని వెంకటరావుకు సూచించారు. లేకపోతే 50 వేల టన్నుల ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపుతామని హెచ్చరించారు. మంత్రి వెంట ఉయ్యూరు ఆర్‌డిఒ హేలా షారోన్, డిఎస్ఒ పి.పార్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానందం, ఆర్టీవో శ్రీనివాసరావు ఉన్నారు.



ఉయ్యూరులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేర సమస్యల పరిష్కారం కోరుతూ ఉయ్యూరు ఆర్టీసీ బస్ స్టాండ్లో పీటీడీ ఉద్యోగులు గురువారం ప్లకార్డులు ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి పీఎం కృష్ణ మాట్లాడు తూ ఉద్యోగుల అక్రమ సస్పెన్లు, రిమూవల్స్ ఆపాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తిజీతం ఇవ్వాలని, గ్యారేజి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించి ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానం పునరుద్ధరిం చడంతో పాటు ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ కొనుగోలుచేయాలని, ఉద్యోగ భద్రతా సర్కులర్ 1/2019 అమలు పరచాలన్నవి ప్రధాన డిమాండ్లుగా తెలిపారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ మెంబరు డీకే రావు, వైస్ చైర్మన్ పిచ్చయ్య, అరుణోదయ, శివ పార్వతి, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ** : గుడివాడ ఆర్టీసీ డిపోలోని సమస్యలు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి కె.వి. రావు డిమాండ్ చేశారు. గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడివాడ ఆర్టీసీ డిపోలో కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గుడివాడ డిపో అధ్యక్షుడు వాసు, సెక్రటరీ డి.ఎల్.ఎల్ మూర్తి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

స్వతంత్రపురం జడ్‌పి హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కోడూరు : స్వతంత్రపురం జడ్పీ హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరగటం గర్వకారణమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కోడూరు శివారు చామర్తి ప్రకాశరాయ స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75వ వార్షికోత్సవం, వజ్రోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 75 ఏళ్ల క్రితమే ఈ ప్రాంత విద్యాభివృద్ధికి విలువైన స్థలాన్ని దానం చేసిన చామర్తి ప్రకాశరాయుడు స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఈ పాఠశాలలో గత 75 ఏళ్లుగా విద్యనభ్యసించిన ఎంతోమంది ప్రముఖులు పెద్దలుగా దేశ విదేశాల్లో ఈ పాఠశాల ఖ్యాతిని చాటి చెబుతున్నారన్నారు. గత కొన్ని పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ప్రశంసించారు. ఈ పాఠశాలలోని ప్రభుత్వ ఉపాధ్యా యులు విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దు తున్నారని అభినందించారు. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలో కొనసాగించే బట్టీ విధానానికి వ్యతిరేకంగా స్వచ్ఛమైన వాతావరణంలో మానవతా విలువలు అలవరుస్తూ నాణ్యమైన విద్య బోధన అందించే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతున్నారన్నారు. డీఈఓ పీవీజే రామారావు మాట్లాడుతూ 75 సంవత్సరాల నుండి చామర్తి ప్రకాశరాయ జడ్పీ హైస్కూల్ నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఫణి ధూర్జటి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు



ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా


ప్రజాశక్తి-ఉంగుటూరు :జనవరి నెల నుండి ఉపాధి హామీ కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీఓ) కార్యాలయం వద్ద వేతన బకాయిలు చెల్లింపు కోరుతూ మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ కార్మికులు వ్యవసాయ కార్మిక సంఘం ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన పవన్ కుమార్ మాట్లాడుతూ పని చేసిన 15 రోజులలో వేతనాలు చెల్లించాలని చట్టం చెబుతుంటే నెలల తరబడి వేతనాలు చెల్లింపు జరగడంలేదని అన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం సమస్యల తో కూడిన వినతి పత్రం ఎపిఓ వినీలాకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మణస్వామి, సంఘం నాయకులు పిల్లి రాజారావు, సలీం, కూలీలు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- నందివాడ : మండలంలోని అర్హులైన ఎస్‌సి అభ్యర్థులు సబ్సిడీ లోన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు.ఈనెల 14వ తేదీ నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు ఎస్‌సిలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి మొత్తం 18 యూనిట్లుకేటాయించామన్నారు. సచివాలయం లేదా మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

కెఇబి కెనాల్లో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ సమీపంలోని కెఈబి కెనాల్లో విద్యార్థి గల్లంతైన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పత్తిపాటి వెన్నెల బట్టలు ఉతుక్కునేందుకు సాయంత్రం కాలువ వద్దకు వెళ్లగా, ఆమె వెంట వచ్చిన కుమారుడు పవన్ (15) కాలువలోకి స్నానం చేసేందుకు దిగాడు. కాలువలో ఒరవడి ఎక్కువగా ఉండటంతో కొద్ది దూరం కొట్టుకుపోయిన పవన్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు. పవన్ శ్రీకాకుళం జడ్పీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాశారు. గతంలో పవన్ తండ్రి కూడా కెఈబి కెనాల్లో మతి చెందాడు. వెన్నెలకు పవన్ తోపాటు ఒక కుమార్తె కలదు.



పవన్ (ఫైల్ ఫొటో)

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కవతవరం-పెడన రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు గురువారం తెలిపారు.ఆ న్ డ్యూటీ కి మాన్ డ్యూటీ చేస్తుండగా అప్ లైన్ ట్రాక్ పై సుమారు 40 సంవత్సరముల పురుషుడు గుర్తుపట్టలేని విధంగా తెలియని రైలు ఢీకొని మృతిచెంది ఉంటాడని కవుతరం రైల్వే మాస్టర్ ద్వారా జిఆర్పి పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు. దీనిపై గుడివాడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మతుడు తెలుపు రంగు లాల్చి, తెలుపు రంగు పైజామా ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు ఎస్సై గుడివాడ 9440627570, 9849596079 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం డి మార్ట్ రోడ్డులో వాటర్ ట్యాంక్ తరలించే ట్రాక్టర్ గురువారం ద్విచక్ర వాహనంను ఢీ కొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడుకు గాయాల య్యాయి.. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిలకలపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎంఎల్ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ గన్నవరం పరిధిలోని బాపులపాడు మండలంలో గల మడిచెర్ల గ్రామంలో నవోదయం 2.0 లో భాగంగా విజయవాడ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు ఆధ్వర్యంలో నాటు సారాయి నిర్మూలన పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నాటు సారాయి వలన కలిగే అనేక నష్టాలు ఉన్నాయన్నారు. నాటు సారాయి సేవించడం, తయారు చేయడం, అమ్మటం, చట్ట ప్రకారం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎక్సైజ్ సిఐ సురేఖ, ఎస్సై అల్లూరయ్య, గ్రామ పెద్దలు పుట్టా సురేష్, మోటూరి శ్రీనివాస్, దేవినేని సత్యనారాయణ, పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని కుమ్మమూరు, పెనమకూరు, గరికపర్రు-2, యాకమూరు-1 అంగన్వాడీ కేంద్రాలలో గురువారం పోషన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఐ సి డి ఎస్ సూపెర్వైసర్ కె. నాగమల్లేశ్వరి పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని,శిశువులు పుట్టిన తర్వాత వెయ్యి రోజుల లోపు బలమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆమె తెలిపారు. తల్లులకు మ్యూజికల్ చైర్ పలురకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. గరికపర్రు అంగన్వాడీ కార్యకర్తలు లావణ్య, రమ, రాధిక, కుమ్మమూరు కార్యకర్తలు కనకదుర్గ, విజయలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : యనమలకుదురు గ్రామంలో ఇందిరా నగర్‌లోని అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 1000 రోజుల సంరక్షణ గురించి అంగన్వాడీ కార్యకర్తలు వివరించారు. ఈ కార్యక్రమంలోసెక్టార్ సూపర్వైజర్ ఎం కళ్యాణి వర్మ, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా స్థానిక అంగన్వాడీ-8 కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలను వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు పాల్గొని మాట్లాడారు. సిడిపొ సుకన్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సూదులగంటి అన్నామణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి ఘంటసాల** : చిన్న పిల్లలకు పౌష్టికాహారం సమద్ధిగా అందేలా చూడాలని తల్లులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.రమా నాగమణి అవగాహన కల్పించారు. గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఘంటసాల -1 సెంటర్లో పిల్లల ఎత్తులు, బరువులు గుర్తించి తల్లులకు అవగాహన కల్పించారు. బరువు తక్కువ, ఎత్తు తక్కువ పిల్లలను గుర్తించటంపై హెల్త్ చెకప్ చేశారు. అవసరమైన పిల్లలను గుర్తించి ఎన్ఆర్సికి పంపించటంపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వై.సునీత తల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : చిరుధాన్యాలు, ఆకుకూరలు తినడం వల్ల గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ వడ్లమూడి సరోజినీ అన్నారు. ఐసిడిఎస్ గన్నవరం ప్రాజెక్టు సిడిపిఓ పి వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం ఉంగుటూరు వెలుగు కార్యాలయంలో జరిగిన జాతీయ 7వ పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో ఎంపీపీ సరోజిని మాట్లాడుతూ లబ్ధిదారులు తమంతట తామే పోషణ్ ట్రాకర్‌లో వారి పేర్లు నమోదు చేసుకోవడం, ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జే విమల కుమారి, మండల విద్యాశాఖ అధికారి జే సాంబశివరావు, ఇఓపిఆర్డీ దిలీప్ కుమార్, ఉంగుటూరు సర్పంచ్ కే వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మొవ్వ** : పెదపూడి అంగన్వాడీ సెంటర్-1లో పోషణ్ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ ప్రాముఖ్యతను ఎ ఎన్ యమ్ బుజ్జి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు టి జ్యోతిలక్ష్మి, ఎం జ్యోతి, సిహెచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** అంగన్వాడి కేంద్రాలలో విద్యతోపాటు పాటలు కూడా నేర్పుతున్నామని అంగన్వాడి సూపర్వైజర్ ఎం. ఝాన్సీరాణి అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని ముళ్ళపూడి అంగన్వాడి సెంటర్‌లో పోషకాహారంపై శిక్షణా నిర్వహించారు. పోషన్ యాప్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. పోషణ యాప్ గర్భిణీలకు, పిల్లలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు, అయినంపూడి, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో...



ఘంటసాల మండలంలో...

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలొద్దు

ఎల్వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రేరణాశెట్టి



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అపోహలు విడనాడాలని, లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళల్లోని కార్నియా వొంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్ళద్దాల అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియ అని ఎల్వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రేరణా శెట్టి తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడె వెంకటాద్రి క్యాంపస్ లో లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సను సాధారణంగా మైయోపియా (హ్రస్వ దృష్టి), హైపర్‌మెట్రోపియా (దూర దృష్టి లోపం), ఆస్టిగ్మాటిజం (వక్రదృష్టి)లను సరిచేయడానికి చేయబడుతుందన్నారు. రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు అయివుండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగి వుండాలని, అపవర్తన దోషం అతితక్కువగానూ, మితంగానూ ఉండాలని, రోగి కళ్ళు మంచి మందంగల కార్నియాలను కలిగివుండాలని, నీటికాసులు, కెరాటోకోనస్ లేదా కంటిశుక్లంలాంటి ఇతర కంటి వ్యాధులు ఉండకూడదన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ ద్వారా 20/25 లేదా అంతకంటే మెరుగైన (కళ్ళద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగలిగేంత స్పష్టంగా చూడగలిగే) దష్టిని పొందడం, అద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, చూపును త్వరిత గతిలో తిరిగి పొందడం, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలుగా ఉన్నాయని, కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు సూచిస్తారన్నారు. లేసిక్ (లేజర్-అసిస్టెడ్ ఇన్ సిటు కెరాటోమిలేసిస్), పిఆర్‌కె (ఫోటోరిఫ్రాక్టివ్ కెరాటెక్టమీ), స్మైల్ (స్మాల్ ఇన్సిషన్ లెంటిక్యుల్ ఎక్స్‌ట్రాక్షన్), విధానాలు ఉంటాయన్నారు. రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది ఎటువంటి నొప్పి ఉండదన్నారు. ఈ సర్జరీ ప్రక్రియ లో లక్షలాది మంది సంతప్త రోగులతో, లేసిక్ 30 సంవత్సరాలకు పైగా నిర్వహించబడుతోందన్నారు. ఈ చికిత్స ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు చాలా ఉన్నాయన్నారు. ఈ చికిత్స జరిగిన తర్వాత ఇకపై ఎప్పటికీ కళ్ళద్దాలు ధరించాల్సిన అవసరం ఉండదు అని చెప్పారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది అందరికీ ఒకే విధంగా పనికొచ్చే పరిష్కారం కాదని, సరైన ప్రక్రియను నిర్ణయించడానికి అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులను సంప్రదించడం అవసరమని అని తెలిపారు.


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న సుధా

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మైలవరం: ఇంటర్ ఫలితాల్లో స్థానిక బాలిక ఉన్నత పాఠశాల హై స్కూల్ ప్లస్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన భూక్య హరిణి ఉన్నత చదువుల నిమిత్తం స్థానిక మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా గురువారం మైలవరం లోని ట్రస్ట్ కార్యాలయంలో రూ 10 వేల రూపాయల చెక్కునుఅందజేశారు. ఈ సందర్భంగా సుధామాట్లాడుతూ పేదరికం వల్ల విద్యార్థులు చదువులకు దూరం కాకూడదని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని ఆ లక్ష్యం కోసం కషి చేస్తే సాధించలేనిది అంటూ ఉండదన్నారు. ఈ సందర్భంగా స్టేట్ ర్యాంకు సాధించిన హరిని దుశ్యాలవాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బాబురావు, ట్రస్ట్ సభ్యులు హైమా, దీప్తి, ఉమా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రజాశక్తి-మైలవరం: అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు అయిన గురువారం స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం,ఎస్ ఎస్ కే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోఅగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గృహాల్లో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా అర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. గ్యాస్, ఆయిల్ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ఏర్పాలో డెమో కార్యక్రమాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం అగ్ని మాపకధికారి ఎం గౌతమ్, ఎల్ ఎఫ్ పి రాజారత్నబాబు, బాలాజీ, ఎన్ పాపయ్య, ప్రసాద్, తిరుపతి వెంకయ్య పాల్గొన్నారు. **విస్సన్నపేట:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విస్సన్నపేట అగ్నిమాపక కేంద్ర సిబ్బంది స్థానిక ప్రజ్ఞ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించి వాటర్ ద్వారా వివిధ రకముల పరికరాలు వాడి డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమములో ప్రజ్ఞ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిబ్బంది, విద్యార్థులుపాల్గొన్నారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-తిరువూరు: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్మికులకు బట్టల అలవెన్స్ వెయ్యి రూపాయలు తక్షణమే ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న మూడు నెలల హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, ఆప్కాస్‌లో రిటైర్ అయిన వారి పిల్లలను ఉద్యోగులుగా తీసుకోవాలని మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాడ్యుటీ అమలు చేయాలని, పుష్ కార్డ్ రిపేర్ చేయించాలని, బ్లౌజులు మాస్కులు ప్రతినెల 5వ తేదీ లోపు ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయ కులు మారిపోగు నాగరాజు, చాపలమడుగు నాగరాజు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆశాలకు పని భారం తగ్గించండి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి-విజయవాడ: ఆశ వర్కర్ల విజయవాడ ఈస్ట్ కమిటీ సమావేశం ఎస్.జోత్స్న అధ్యక్షతన రాణిగారితోటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కమల మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలతోపాటు, ఆశ వర్కర్లు కూడా సర్వే చేయలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఉన్నతాధికారులు ఎన్‌సిసిడి సర్వే చేయాలని, 2024 సంవత్సరం నవంబర్ నెలలో ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. కానీ నేటికీ ఇంకా సర్వే పూర్తి కాలేదని, కాకపోవటానికి అనేక ఆటంకాలు కూడా ఉన్నాయనిఅన్నారు. చాలా చోట్ల నెట్ సరిగా లేక, సర్వర్లు సరిగా పనిచేయక, ఓటీపీ నెంబర్‌లు చెబితేనే ఈ సర్వే చేయడానికి వీలు పడుతుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతిరోజు 30 నుండి 50 ఇళ్ల వరకు సర్వే చేసి ఐడి ం చేయాలని టార్గెట్లు పెట్టి, ఆ టార్గెట్ పూర్తి చేయని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తామని అధికారులు చెప్పడం వలన ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈ సర్వే వల్ల ఆశా వర్కర్ల రోజువారి పనులు కూడా చేయలేక పెండింగ్లో ఉంటున్నాయని, ఈ పనులకు ఆటంకం కలగకుండా ఉండేలా సర్వే పనులు అప్పజెప్పాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి పి.శ్రీలక్ష్మి, ఎ.భవాని, టి.వెంకటేశ్వరమ్మ,ఆర్. అమల, వి.కళ్యాణి, వి.సుశీల, యస్,శ్యామల, యస్.పద్మా తదితరులు పాల్గొన్నారు.




మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని జయంతిపురం గ్రామంలో హరిజనవాడలో 7వ వార్డులో తాగునీటి సమస్యను గ్రామ ప్రజలు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకు రావడం జరిగింది. తక్షణమే స్పందించిన తాతయ్య పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండకూడదని బోర్ వేసి, మోటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు దాహార్తిని తీర్చేందుకు బోర్ ను, మోటర్ ను ఏర్పాటు చేశారు. గురువారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా ప్రారంభించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన


రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-విస్సన్నపేట: విసన్నపేట మండలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సందర్శించారు. అనంతరం హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలోపాల్గొన్నారు. హాస్పిటల్ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, వసతులు వైద్యం మరియు సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో కాసేపు మాట్లాడుతూ వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి మెరుగైన వైద్యం అందుతున్నదా లేదా అని తెలుసుకున్నారు.

నేడు విశ్వభారతిలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో దివిస్ లబోరేటరీస్ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కే. ఎన్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ జల్లా తిరుపతిరావు తెలిపారు. తెలుగు రాష్ట్రాలలోనే ప్రముఖ బల్క్ డ్రగ్ పరిశ్రమైనా దివిస్ లేబరేటరీలో ఉద్యోగం కావాలనే యువతీ, యువకులు అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్య ప్రముఖులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకటరాజీవ్ కోరారు.

చైర్‌పర్సన్ రాజీనామాపై చర్చకు పట్టు

ప్రజాశక్తి-తిరువూరు: పాలక పక్షంలోని కొంతమంది వైసిపి కౌన్సిలర్లు, టిడిపికి చెందిన కౌన్సిలర్లు ఏకమై తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని రక్తి కట్టించారు. దీనితో సమావేశానికి అధ్యక్షతన వహించిన చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి ఏమీ చెప్పకుండా అర్ధాంతరంగా సమా వేశం నుండి నిష్క్రమించి ఉత్కంఠకు తెరలే పారు. కస్తూరి బాయి ఇటీవల చైర్ పర్సన్ పదవికి చేసిన రాజీనామా లేఖను కమిషనర్‌కు అందజేశారు. ఆమె రాజీనామాను ఆమోదం కొరకు కౌన్సిల్ ఎజెం డాలోని 4వ అంశంగా పొందపర్చారు. ఇంకా పది నెలల పదవీ కాలం ఉండగా ఇప్పుడు రాజీనా మా చేయటం ఏమిటి, ఐదేళ్ల అధికారం అప్పగిస్తే ఇలా చేయటం బాగాలేదు, రాజీనామాపై వివరణ ఇవ్వాలని టిడిపి కౌన్సిలర్ హుసేన్ చైర్ పర్సన్‌ను కోరారు. వైసిపికి చెందిన 7వ వార్డ్ కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు చైర్ పర్సన్ రాజీనామాపై వివరణ ఇస్తుండగా అర్ధంతరంగా సమావేశం నుంచి చైర్ పర్సన్ వెళ్ళారు. ఏజెండాలోని నాలుగు అంశాలను ఆమోదం తెలపకుండా వెళ్ల కూడదని సభ్యులు చెబుతున్నటికి ఆమె వెళ్ళి పోవడంతో కౌన్సిల్ సమావేశం అమోమయంలో పడింది. సుమారు 45 నిమిషాలు ఆమె రాకకై ఎదురు చూసిన



సభ్యులకు చైర్ పర్సన్ ఆరోగ్యం బాగాలేదని, సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు వైస్ చైర్ పర్సన్ వెలుగోటీ విజయలక్ష్మి ప్రకటించారు. ఇదంతా ప్లాన్ ప్రకారమే జరిగిందని వైసిపి కి చెందిన అసమ్మతి సభ్యులు పెదవి విరుస్తున్నారు. టిడిపి కౌన్సిలర్లు కూడా కస్తూరి బాయికి పరోక్షంగా మద్దతు పలికి కౌన్సిల్ సమావేశం రక్తి కట్టించారని చెబుతున్నారు. కస్తూరి బాయి రాజీనామాను మేము ఆమోదిస్తామని తమ వైసిపి సభ్యులు, టీడీపి సభ్యులతో కలిసి చెబుతూనే ముందుగానే సిద్ధం చేసుకున్న ప్లాన్ ప్రకారమే చైర్ పర్సన్‌ను బయటకు పంపించారని అసమ్మతి సభ్యుల ఆరోపణలు బలంగా ఉన్నాయి.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ 33వ రోజుకు చేరింది. చలివేంద్రం వద్ద కీర్తిశేషులు మట్టపల్లి శాంత కుమారి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. బియ్యం, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు పేరూరి నరసింహారావు చేతుల మీదుగా మజ్జిగ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యన్నాకుల రాంబాబు, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ పువ్వాడ పార్థసారథి, యన్నాకుల శివ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తూ సమాజ సమగ్ర అభివద్ధికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతున్నాయని చల్లపల్లి మండల విద్యాశాఖ అధికారి పరిశేవెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పురిటిగడ్డ పంచాయతీ శివారు నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారి భవిష్యత్తును రూపొందించడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బి. చెన్నకేశవ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్ బాబు, విజయభాస్కర్, ఏ.గోపాలకష్ణ పాల్గొన్నారు

విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అందించాలని మంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి రమణ కోరారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం మండల పరిషత్ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుల బందం 9వ తరగతి విద్యార్థులను మంగళాపురం పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు, ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు,యూనిఫామ్, అమ్మ వాడి వంటి సంక్షేమ పథకాలు విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వీరాంజనేయులు, ఎల్ మనుబాబు, లక్ష్మీపురం, ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై సునీత పాల్గొన్నారు

వ్యాపారికి గొడుగు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులకు గుడివాడ జెసిస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా గొడుగు అందజేయడం ప్రశంసనీయమని జేసీ పూర్వాధ్యక్షులు తాడిపర్తి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక ఏలూరు రోడ్‌లో పాత నవోదయ బుక్ షాప్ ఎదురుగా వ్యాపారం నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్న షోడాబండి నిర్వాహకునికి జెసి అధ్యక్షురాలు లక్కీ జైన్ ఆధ్వర్యంలో గొడుగు అందజేశారు. జెసి పూర్వ అధ్యక్షులు రూప్ చంద్ జైన్, జేసీ కార్యదర్శి అన్నం స్వామి, పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామాల్లో అధ్వాన్నంగా మారిన అంతర్గత రహదారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు గన్నవరం మండలం మాదలవారిగూడెంలో రూ.43 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, ముస్తాబాద్‌లో రూ.71 లక్షల నిర్మించిన రెండు సిసి రోడ్లను పురుషోత్తపట్నం గ్రామంలో రూ. 30 లక్షల ఖర్చుతో నూతనంగా నిర్మించిన ఒక సీసీ రోడ్డును గురువారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రహదారుల అభివద్ధిని పట్టించుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత అధ్వాన్న రహదారులను పునర్నించే కార్యక్రమం వేగవంతంగా సాగుతుందన్నారు.



సిసి రోడ్లు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే పలు గ్రామాలకు ప్రధాన రహదారులను అంతర్గత రహదారులను పునర్ నిర్మించినట్లు చెప్పారు.టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, నాయకులు పాలడుగు మల్లికార్జునరావు, మేడేపల్లి రమ, ఆయా గ్రామటిడిపి అధ్యక్షులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరికి మండలి సన్మానం



కొల్లూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, కూటమి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా ఎన్నికైన కొల్లూరు వెంకటేశ్వరరావును ఎంఎల్ఏ బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కూటమి నాయకులు తమ గ్రామాల్లోనూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చేసిన విమర్శలపై ఆయన స్పందిస్తూ ఎక్కడైనా అవినీతి జరుగుతుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, మాజీ సి డి సి చైర్మన్ రావి నాగేశ్వరరావు, డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** అవనిగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావు దంపతులను మోపిదేవి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, మాజీ సర్పంచ్, సి డి సి చైర్మన్ రావి నాగేశ్వరరావు, కోక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కుమార్ పాల్గొన్నారు.



మినుము పంట పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బందం గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డ గ్రామం లో వేసవిలో మినుము పంటపై క్షేత్ర సందర్శన చేశారు. ఇందులో భాగంగా సమన్వయకర్త డా. డి. సుధారాణి మాట్లాడుతూ మినుము పంట లో రసం పీల్చే పిరుగు నిర్మూలనకు ఇమిడక్లోప్రిడ్ 0.3 మీ.లీ లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా లేదా ఫిప్రోనిల్ 2 మీ.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, అలానే తెల్ల దోమ ఉధృతి గమనించడానికి పసుపు జిగురు అట్టలు-8/ఎకరాకు పెట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డా. యం. వెంకట లక్ష్మి శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

శశికళకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు లయన్ డివిజన్ జోన్ చైర్మన్‌గా నిమ్మగడ్డ శశికళ నియమితులయ్యారు. లయన్స్ 27వ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ లో 2025-2026 సంవత్సరానికి గాను గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ను గుడ్లవల్లేరు లయన్స్ డివిజన్ కు జోన్ చైర్మన్ గా గవర్నర్ వివిపిస్ ఆంజనేయులు నియమించినట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైటిసి ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు లయన్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.



ప్రతి వృద్ధుడికి బ్యాంక్ ఖాతా ఉండేలా చర్యలు : కలెక్టర్


ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రతి రెవిన్యూ డివిజన్ పరిధిలో వయో వృద్ధులకు పోషణ ట్రిబ్యునల్‌లో బ్యాంక్ అకౌంటును ఓపెన్ చేయాలని జిల్లా కలెక్టర్ డి కె.బాలాజీ సూచించారు.విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వద్దుల సంక్షేమ



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

శాఖ, కష్ణాజిల్లా వారి ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్, కష్ణాజిల్లా అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో గురువారం జరిగింది. ఈ సదర్భంగా కలక్టర్ వయో వద్ధుల, దివ్యాంగుల అభిప్రాయాలను మరియు సమస్యలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల కొరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం చూసే ఉద్యోగిని తక్షణమే మొదటి అంతస్తు నుండి కిందకు మార్చలని , ప్రభుత్వ ఆసుపత్రి, సూపరింటెండెంట్ ఆదేశించారు. అన్ని బ్యాంక్ లలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక కౌంటర్ లు, బోర్డు లు ఏర్పాటు చేయలాన్నారు. ఈ సమావేశం లో జిల్లా ఏ.ఎస్.పి వి.వి నాయుడు,జిల్లా ప్రజా పరిషద్, సి.ఇ.ఓ.కన్నమ నాయుడు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, ఆర్‌డిఓ లు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం



ప్రజాశక్తి - నాగాయలంక : మే నెల 10,11 తేదీలలో ఏలూరులోని మహాలక్ష్మి-గోపాల స్వామి కళ్యాణ మండపంలో శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో రెండురోజులు పాటు జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలలో పాల్గొనేందుకు అవనిగడ్డ శివారు బందలాయి చెరువు గ్రామానికి చెందిన ఈ ఏడాది రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత సింహాద్రి వాణికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ప్రపంచ కవితోత్సవంలో పాల్గొని కవితాగానం చేస్తానన్నారు. ఈ సంబరాలలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నలందాలో పిజి సెట్ హెల్ప్‌లైన్ కేంద్రం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విజయవాడ నలందా డిగ్రీ కళాశాలలో పిజి సెట్ హెల్ప్ లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్ సుశీల తెలిపారు. పిజి సెట్ కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సౌలభ్యం కోసం, వారి అనుమానాల నివృత్తి కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో అమలు చేస్తున్న కోర్సులపై సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దూర ప్రాంతాల కు చెందిన విద్యార్థులు కష్ణా విశ్వవిద్యాలయం వరకు రాకుండా విజయవాడలో వివరాలు పొందవచ్చని తెలియజేసారు. హెల్ప్ లైన్ కేంద్రం లో విశ్వవిద్యాలయంకు చెందిన అధ్యాపకులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన కెయు ఉపకులపతి



ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ గిరీశాను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భముగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో పాటు విజయవాడలో పిజి సెంటర్ ఏర్పాటు పై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొక్కను బహూకరించారు.

వెల్‌నెస్ సెంటర్ సందర్శన



ప్రజాశక్తి-కంకిపాడు: యనమ లకుదురు, సాయి నగర్‌లోని శ్రీనివాస టవర్స్‌లో చందు వెల్ నెస్ సెంటర్‌ను ఏపీ ఐఐసీ డెరెక్టర్ మండలి రాజేష్ సందర్శించారు. వరల్డ్ నంబర్ వన్ న్యూట్రీషియన్ కంపెనీ పర్యవేక్షణలో సాగుతున్న వెల్ నెస్ ట్రీట్ మెంట్ ని పరిశీలించి కోచ్, నిర్వాహకులను అభినంది ంచారు. అధిక బరువు, స్థూలఖాయం లాంటి సమస్యలకు చందు వెల్ నెస్ సెంటర్ అద్భుత పరిష్కార మార్గాలు చూపుతోందని, ఎంతో మంది ఇక్కడ లభించే సహజ సిద్ధమైన న్యూట్రీషియన్ ఫుడ్ తో పాటు కోచ్ పుష్ప నారయ్య పర్యవేక్షణలో మంచి ఫలితాలు వస్తున్నాయనిరాజేష్ తెలిపారు. వర్రే శశికళ లాంటి గహిణులు ఇలాంటి సామాజిక పరివర్తన కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా చందును వెల్ నెస్ సెంటర్ నిర్వాహకులు మండలి రాజేష్ గారిని సత్కరించారు.

ఘనంగా శ్రీకాకుళేశ్వర జెడ్‌పిహెచ్ 74వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం అమ్మి రెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులందరూ పట్టుదలతో కషి చేస్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. గోగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోడి కోటేశ్వరమ్మ, శ్రీకాకుళం గ్రామ సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, తెలుగురావుపాలెం గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే ఏర్పాటు చేయబడ్డ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల అందిస్తున్న దశ్యం

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టండి

ప్రజాశక్తి-గంపలగూడెం: గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలులో రైతులు దగా పడుతున్నట్లు అమ్మిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ బజ్జూరి చంద్రశేఖర్, ఎంపిటీసీ సభ్యులు తమ్మారపు శంకర్రావు ధ్వజమెత్తారు. గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ అధికారి బి సాయి శ్రీ ఇటీవల జరిగిన పంట నష్టం, ధాన్యం కొనుగోళ్ల అంశాలను వివరిస్తుండగా సభ్యులు అడ్డుపడ్డారు. రైతు సేవా కేంద్రాల్లో ఒక క్వింట ధాన్యం విక్రయిస్తే 80 కిలోలకే నమోదు చేస్తున్నారని, రైతుకు రావలసిన సొమ్ములో 325 రూపాయలు కోత విధిస్తున్నట్లు సభ్యులు ఆరోపించారు. అదేమని సాక్షాత్తు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమక్షంలో ప్రశ్నిస్తే సదరు ఏవో మిల్లర్లను రైతులే సంప్రదించాలని బదులివ్వడంతో సభ్యులు ఆగ్రహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ కల్పించుకొని రైతులకు జరుగుతున్న దగాను నియంత్రిస్తామని చెప్పకపోవడం గమనార్హం. చిన్న, సన్న కారు రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. దీంతో దిక్కులేక 78 కిలోల బస్తాకు 150 రూపాయల నష్టానికి తెగనమ్ముకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వం నుండి సంచులు సరఫరా కూడా అంతంత మాత్రమేనన్నారు. ముందుగా ఆయా శాఖల వారీగా మండల స్థాయి అధికారులు వార్షిక ప్రణాళిక అంశాలను వివరించారు.

వేసవిలో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించండి: ఎమ్మెల్యే

ఈ ఏడాది అన్ని గ్రామాల్లో అంతర్గత డ్రైనేజీ అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్ది, రానున్న వర్షా కాలానికి సమస్యలు తలెత్తకుండా చేయాలని ఎమ్మెల్యే కే శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ ఏడాది స్థానిక ప్రభుత్వ కళాశాలలో కేవలం 45 శాతం మాత్రమే ఉత్తీర్ణత శాతం రావడంపై ఆయన స్పందించారు. ఒకటి రెండు మార్కుల తేడాతో నష్టపోయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో శ్మశాన వాటిక స్థలాల సమస్యలు ఉంటే తాసిల్దార్ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలిపితే పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు కే.శామ్యూల్, ఎంపీడీవో పి.వఎస్ నాగేశ్వరరావు, తాసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

పరిశుభ్రతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చడంలో గ్రామాలు పూర్తిగా సహకరించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బి.అర్జునరావు అన్నారు. మండలంలోని సూరం పల్లి గ్రామంలో గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు పర్యటించారు. గ్రామంలోని ఎస్ డబ్ల్యు పీసీని సందర్శించి ప్రభుత్వ శాఖలలో పని చేసే అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ బి.అర్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లో తప్పని సరిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించాలని చెప్పారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. సర్పం చ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోపీఆర్డీ భారతి, పంచాయితీ కార్యదర్శి టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అర్జునరావు

గుంతను పూడ్చరూ...

ప్రజాశక్తి-చల్లపల్లి: రహదారి పక్కనే తవ్విన ఇంకుడు గుంటను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు. చల్లపల్లి పంచాయతీ శివారు నారాయణరావు నగర్ కాలనీ నుండి జగనన్న లేఔట్ 3కాలనీకి హిందువుల ముస్లిం వాటికకు వెళ్లే రహదారికి పంపుల చెరువుకు మధ్యలో సుమారుగా 20 అడుగుల లోతు ఉపాధి హామీ కూలీల చేత తవ్వించిన ఇంకుడు గుంత వల్ల ప్రమాదం పొంచి ఉన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి ప్రక్కన వీధిలైట్లు లేకపోవడం రాత్రి సమయాలలో ప్రజలు విద్యార్థులు ఈ గుంటలో పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపుల చెరువు పక్కనే ఇంత పెద్ద ఇంకుడు గుంట తవ్వటం అవసరమా అని పాలకులను ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అంచు వరకు ఈ గుంట తవటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాలలో కాలనీలోకి వెళ్లే మహిళలు, వృద్ధులు,విద్యార్థులు, వాహనదారులు గుంతలో పడే ప్రమాదం ఉందని, వెంటనే గుంత పూడ్చి వేయాలని మండల సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వరసిద్ధి వినాయక ఆటో యూనియన్ అధ్యక్షులు పసుపులేటి అంజయ్య తదితరులు డిమాండ్ చేస్తున్నారు.



పేద విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 957 మార్కులు సాధించిన చల్లపల్లి గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని మునిపల్లి వినీతను బీసీ, దళిత, ప్రజాసంఘాల నేతలు సన్మానించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట వినీత, తల్లిదండ్రులు మునిపల్లి జయకృష్ణ, సీత దంపతులను అభినందించారు. విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి కొంతమేర సాయమందించారు. అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నేత అందె జగదీష్ విద్యార్థినిని సత్కరించి నగదు బహుమతి అందించగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, విశ్రాంత ఫోర్మెన్ ఉప్పల సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ నేత మీర్ రిజ్వాన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, రమాబాయి అంబేద్కర్ సేవాసంఘం నేతలు స్పందించి విద్యార్థిని అభినందించి ప్రోత్సాహక నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి బుజ్జి, మేరుగు రమేష్, మాతంగి నరసింహారావు, లంకా బోస్, చిర్ల కిషోర్, మాతంగి రత్నాబాబు, బూసి సుబ్రమణ్యం, దాసి రాజు, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు అండగా శివాజీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామపంచాయతీ కార్యదర్శి బి.శివాజీ మూగజీవాల పట్ల తన ప్రేమను చాటుకుంటున్నాడు. చిల్లకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతిరోజు కోతులకు ఆరు డజన్లు అరటి పండ్లు. కుక్కలకు బిస్కెట్లు పెడుతూ జంతువుల పట్ల తనకున్న ప్రేమను చాటుతున్నాడు. మూగజీవాల పట్ల శివాజీకి ఉన్న ప్రేమను చూసి తోటివారు, అధికారులు అభినందిస్తున్నారు.



ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయులు ప్రచారం


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మా బడికి రండి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముక్త్యాల, జయంతీపురం, పట్టణంలోని విలియంలలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరానికి 20 మంది విద్యార్థులను జాయిన్ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరానికి కావలసిన బ్యాగులు, పుస్తకాలు, షూస్, ఇంకా ఇతర వస్తువులు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో చక్కని వాతావరణంలో విద్య బోధన ఆంగ్ల మాధ్యమంలో జరుగుతున్నది, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగమణి, టీవీఎల్ నరసింహారావు, సిఆర్పిలు రమేష్, దుర్గా, మధు మరియు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కసుకుర్తి మంగతాయమ్మ, సర్పంచ్ గుగులోతు మణిహూస్సేన్ పెరేంట్స్ కమిటీ ఛైర్మన్ ధారావత్ రోజా, ఉపాధ్యాయులు పర్చా లక్ష్మణరావు, ఉపాధ్యాయినులు టీ.వి. సుజాత, ఆరోగ్య మేరి, వసంత పాల్గొన్నారు.

కోతుల నుండి పంటలను రక్షించాలి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: కోతుల కారణంగా మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా నాయకులు ఎం మాధవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సీజనల్ పంటలకు కోతుల సమస్య తీవ్రంగా ఉందని, పంట చేతికి వచ్చే సమయంలో కోతులు ఒక్కసారిగా పంటలను నాశనం చేసే కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. దీంతో పంటల పై ఎంతో పెట్టుబడి పెట్టిన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనుషుల కంటే కోతుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందనీ, దీంతో ఏమి చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అధ్యయనం చేసి కోతుల కోతుల ఉత్పత్తి తగ్గించే చర్యలు తీసుకోవాలని, ఉన్న కోతులను పట్టి అడవుల్లో వదిలేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నరని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు మాధవరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు

టిటిడిపై భూమన ప్రచారం అవాస్తవం : నెట్టెం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సిట్ దర్యాప్తులో వైసీపీ వాళ్ల బండారం బయటపడుతుందోనని ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికే టీటీడీ గోశాలలో ఆవులు మరణించాయని భూమన చేస్తున్న ప్రచారం అవాస్తవమని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురామ్ ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీలో గత ఐదు సంత్సరాల పాలనలో జరిగిన దారుణలపై కూటమి ప్రభుత్వం సిట్ దర్యాప్తుపై పూర్తి విచారణ జరుగుతున్న సమయంలో వైసీపీ బండారం ఎక్కడ బయటపడుతుందో అనే పరిస్థితుల్లో టీటీడీ గోశాలలో ఆవులు మరణించాయని భూమన కరుణాకరరెడ్డి ప్రచారాన్ని మొదలుపెట్టారన్నారు. నేడు టీటీడీ గోశాలలను పూర్తిగా పారదర్శకంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల సంఘం నేత ముల్లంగి రామకృష్ణారెడ్డి, గింజుపల్లి రమేష్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, అమ్మనబోయిన రాణి, సంక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడిచెత్తపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: తడి చెత్త పొడి చెత్త అనేది ఎలా విడదీసి ఇవ్వాలి అనేదానిపై అవగాహన కల్పించడం జరిగిందని పిఆర్అండ్ఆర్డి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని వేమండ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం ఎనర్జీ ఎస్ ఉపాధి హామీ కూలీలతో దిలీప్ కుమార్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సామాగ్రికేషన ఎలా చేయాలి అంటే ఇంటి నుంచే తడి చెత్తని అనగా వంటగది నుండి వచ్చే కూరగాయలను తడి చెత్త గాను,పొడి చెత్త అంటే ప్లాస్టిక్ వేస్ట్ లు,వాటర్ బాటిల్స్, అట్ట పెట్టెలు, పాడైపోయిన ట్యూబ్ లైట్లు, ఇలాంటి వి సామాగ్రి కేన్స్ చేసి విడగొట్టి మరీ గ్రీన్ అంబాసిడర్ కు అందజేయాలి అని వివరించారు. అలాగే ఎస్ డబ్ల్య పిసి షెడ్లు (చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని) సందర్శించి అక్కడ జరుగుతున్న యాక్టివిటీస్ ఎలా ఇంప్రూవ్ చేసుకోవాలో కూడా పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. వాటర్ ట్యాంక్ లను పరిశీలించి కడిగిన తేదీ కడగ వలసిన తేదీ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేంపాడు,వేమండ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 17వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఈల్లా రవి మాట్లాడుతూ ప్రతి ఏడాది మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల దాత డాక్టర్ లక్కిరెడ్డి అనిమిరెడ్డి మాట్లాడుతూ చదువు అనే మూడు అక్షరాలు నమ్ముకొని వివిధ రంగాలలో స్థిరపడాలని సూచించారు. చదువుకునేటప్పుడు తాను ఎన్నో కష్టాలు చూశానని చదువు విలువ తెలుసుకున్నాను కాబట్టే పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కోసమే ఈ కళాశాల స్థాపన ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన 25 మంది విద్యార్థులకు బంగారు పతకం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిడిసి మెంబర్ శ్రీనివాసరెడ్డి, సాంబశివారెడ్డి, దేవానంద్ కుమార్, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ రవి



కాల్వల ఆధునీకరణకు గ్రాంటు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కుడి ఎడమ కాలువలు ఆధునీకరణ చేయటానికి గ్రాంటు మంజూరు చేయాలని భారత 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డా.. అర్వింద్ పనగారియాకు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డా.. అర్వింద్ పనగారియా బందం సభ్యులు రాజకీయ పార్టీలతోను, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమావేశంలో ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు గ్రాంటు మంజూరు చేయాలని పూర్తి వివరాలతో వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కృష్ణాజిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ దేవినేని సత్యనారాయణ, కుడికాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, ఎన్.టి.ఆర్. జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు కటారి కోటేశ్వరరావు వున్నారు.



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : వికలాంగ బాలలు ఆత్మస్థైర్యంతో జీవించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని భవిత కేంద్రాల్లో ఉన్న 28 మంది వికలాంగ బాలలకు మూడు లక్షల 58 వేల విలువ కలిగిన వీల్ చైర్లు బ్యాటరీ వీల్ చైర్లు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడారు. సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పని ధూర్జటి, నియోజక వర్గ యువనాయకులు మండలి వెంకట్రాం సుమతీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

ప్రజాశక్తి- నందివాడ : మండలంలోని జనార్ధనపురం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు భూసార పరిరక్షణ ఆవశ్యకత గురించి మండల వ్యవసాయాధికారి ఎన్. భాను ప్రకాష్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు పచ్చి రొట్ట విత్తనాల వాడకం మరియు పశువుల ఎరువుల వాడకం తగ్గించడం వలన భూమి లో సేంద్రీయ పదార్థం తక్కువై మొక్కకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు నశిస్తున్నాయని అన్నారు. రైతులు మట్టి నమూనాలు తీసుకుని పరీక్ష చేయించుకుంటే యెడల ఏ ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవలె నో తెలుస్తుందన్నారు. మట్టి పరీక్షలు చేయించదలచిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జనార్ధనపురం నీటి సంఘం అధ్యక్షులు సారిపల్లి ఉమాశంకర్ రెడ్డి , గ్రామ రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలంలో సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో మట్టి నమూనా సేకరణ పై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. జిల్లా ఇన్చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి మనోహర్ రావు మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని పంట పొలాల్లో మట్టి నమూనా సేకరించాలని తెలిపారు. అలాగే వేసవిలో తీసేటువంటి మట్టి నమూనాలను సేకరణ పై తగు సూచనలు, దాని ఆవశ్యకత గురించి తెలిపారు. మట్టి నమూనాలు సేకరించి మట్టి నమూనా పరీక్ష కేంద్రం గుడివాడ కు పంపాలని సూచించారు. అదే విధంగా గ్రామంలో వేసవిలో వేసే పంటలకు ఈక్రాప్ బుకింగ్ మొదలైనదని



నందివాడ మండలంలో మట్టి పరీక్షిస్తున్న దృశ్యం



గన్నవరం మండలంలో మట్టి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మార్చి ,ఏప్రిల్ లో వేసిన పంటలన్నీ కూడా పంట నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. గన్నవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్ , గన్నవరం వ్యవసాయ అధికారిని వై రజని, లంకా శ్రీనివాసరావు , బాపులపాడు వ్యవసాయ అధికారిని జె భవాని పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : వేసవికాలం తీవ్ర ఎండల దృష్ట్యా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఔట్ పేషెంట్ గా వచ్చే రోగులకు, సహాయకులకు మజ్జిగ , అరటి పండ్లు గురువారం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ ఆశాలత పంపిణీ చేశారు. దాతల సహాయంతో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ను కొనసాగిస్తామని సూపర్డెంట్ తెలిపారు. డిప్యూటీ సూపర్డెంట్ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ నిరంజన్, ఇతర వైద్య సహాయక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలి : కలెక్టర్



తడి,పొడి చెత్త పరీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తడి చెత్త, పొడి చెత్త సేకరణ విధానాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. మండలంలోని వడ్లమన్నాడు గ్రామ శివారు రెడ్డిపాలెంలో తడిచెత్త , పొడిచెత్త సేకరణ, షేడ్ లను గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అదేవిధంగా తడి చెత్త పొడి చెత్తను విడివిడి డస్ట్ పిన్ లో గహిణులు నిల్వ ఉంచి వాటిని పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. వాటి ద్వారా సంపదను తయారు చేసుకునే పరిశ్రమ ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ విజయ సారథి, గ్రామ ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, బెల్లంకొండ ఏడుకొండలు, కార్యదర్శి ఎలీషా రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యలో 'రిషి' విద్యార్థుల ప్రతిభ



విజయసంకేతాన్ని చూపుతున్న రిషి ఒకేషనల్ విద్యార్థులు

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఒకేషనల్ విభాగంలో స్థానిక రిషి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులను సాధించి రికార్డులను తిరగరాసారని కళాశాల ప్రిన్సిపాల్ కె.శరత్‌బాబు అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విద్యార్థులు సాధించిన ర్యాంకు వివరాలను తెలిపారు. సీనియర్ ఇంటర్ విభాగంలో ఎం.ఎల్.టి విభాగంలో కొడాలి ఆంజనేయప్రసాద్ 961/1000 మార్కులతో స్టేట్ 3వ ర్యాంకు, వై.వి.వి హేమలత 948/1000 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎం.ఎల్.టి విభాగంలో వంజరపు హారిక 488/500 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు, వేముల చంద్రిక 480/500 మార్కులతో స్టేట్ 5వ ర్యాంకు, తంగెళ్ళమూడి కళ్యాణి 474/500 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకు, వీరంకి కౌషిక్ ఆజయ్‌కుమార్ 472/500 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకు, ఎం.పి.హెచ్.డబ్ల్యూ (మహిళల) విభాగంలో లేళ్ళ షైనీ 473/500 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు, పంతగాని పెర్సీస్ 472/500 మార్కులతో స్టేట్ 5వ ర్యాంకు, గూడపాటి సురేఖ 471/500 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకులు సాధించిన గుడివాడ చరిత్రలో ఒకే ఏడాది ఇన్ని స్టేట్ ర్యాంకులను సాధించారని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన మచిలీపట్నంలో రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ, జిల్లా ఎస్.పి ఆర్.గంగాధరరావుల చేతుల మీదగా తమ కళాశాల విద్యార్థులు లేళ్ళ షైనీ, వేముల చంద్రికలు అవార్డులను అందుకున్నారని ప్రిన్సిపాల్ శరత్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎం.లక్ష్మి, కె.అనూష, ఎం.అశోక్‌కుమార్, శ్రీను, తల్లిదండ్రులు స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

జాబ్‌మేళాలో 76 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : నైపుణ్యాల అభివద్ధి శిక్షణ శాఖల ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశా లను సద్విని యోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాల అభివద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి సాకారంతో జిల్లా ఉపాధి అధికారి ఆఫీసర్ డి విక్టర్ బాబు, జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి డాక్టర్ పి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 113 మంది హాజరు కాగా అందులో 76 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 14 మంది తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్ రామ్, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, నైపుణ్యాభివద్ధి సంస్థ సిబ్బంది జి పద్మజ, ఆర్ ప్రశాంత్ పాల్గొన్నారు

19న గుడివాడలో 'రన్ ఫర్ జీసస్'

ప్రజాశక్తి - గుడివాడ : ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఈ నెల 19వ తేది శనివారం ఉదయం 5.30 గంటలకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పాస్టర్ జి.శ్యాంబాబు తెలిపారు. గురువారం స్థానిక ఫుల్ గాస్పెల్ చర్చస్ ఆఫ్ ఇండియా చర్చిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బిషప్ అప్పికట్ల జాషువా మాట్లాడుతూ శనివారం ఉదయం ఏలూరు రోడ్‌లో ఉన్న ఆర్.సి.యం చర్చి వద్ద నెహ్రూ చౌక్, మార్కెట్ సెంటర్‌ల మీదగా బస్టాండు సెంటర్ ప్రక్కరోడ్ నుండి ఫుల్ గాస్పెల్ చర్చిలో ముగింపు సభ జరుగుతుందని తెలిపారు.

ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయొద్దు

ప్రజాశక్తి-బంటుమిల్లి : వ్యవసాయ కార్మిక సంఘం బంటుమిల్లి మండల విస్తత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు హాజరయ్యి ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పనులనుకొన్ని మండలాల్లోనే ప్రారంభించారని, అన్ని చోట్ల పనులు ప్రారంభించాలన్నారు. ప్రతి ఒక్క వ్యవసాయ కార్మికుడికి 200 రోజులు పని కల్పించి 600 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పనిని వ్యవసాయానికి అనుసంధానం చేయొద్దని, అలా చేస్తే వ్యవసాయ కార్మికులు నష్టపోతారని ఆయన అన్నారు. వివిధ డిమాండ్లపై మే నెల ఐదో తారీకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగిశెట్టి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బొడ్డు నాగరాజు, నాగిశెట్టి కష్ణ, తోట ఆంజనేయులు పాల్గొన్నారు

ఎన్‌టిఆర్ సేవా కిట్టు అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : వడదెబ్బ తగలకుండా వేసవికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మెరుగు బాలాజీ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ అయిన మహిళకు ఎన్టీఆర్ సేవా కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిబిడ్డల రక్షణకు అందించే సేవలను వినియోగించు కోవాలని అన్నారు.



విద్యార్థులు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

- 374 మంది నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు
- విద్యార్థులను సత్కరించిన కృష్ణా వర్శిటీ విసి రామ్‌జీ



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ రామ్ జీ కునా అన్నారు. నలంద డిగ్రీ కళాశాల నందు 2024-2025 లో అత్యధిక ప్లేస్మెంట్స్ సాధించిన సందర్భంగా గవర్నరుపేటలోని ఎం. బి.భవన్‌లో గురువారం సక్సెస్ మీట్ -2025 జరిగింది. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఉప కులపతి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం కష్టంగా ఉందని ,అటువంటిది వివిధ కార్పొరేట్ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ నందు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచి ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అన్నారు. కష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని విజయవాడ నలంద డిగ్రీ కళాశాల కు మంచి పేరు ఉందని అన్నారు. ప్రపంచంలోనే ప్రఖ్యాత నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలకు మంచి గుర్తింపు ఉందని, అటువంటి సంస్థ పేరుతో నలంద డిగ్రీ కళాశాల కూడా మంచి ఫలితాలను సాధిస్తుందని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందించారు. ఎన్‌టిఆర్ జిల్లా యువజన సేవల విభాగం ముఖ్య కార్య నిర్వహణాధికారీ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కళాశాలలో కొత్త కోర్సు లను ప్రారంభించి విద్యార్థులకు చక్కని విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు చక్కటి కోర్సు లను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగ పడే విధంగా ఉపాధి అవకాశాలను కూడా అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ 2024- 25 విద్యా సమత్సరంలో తమ కళాశాల విద్యార్థులు వివిధ కార్పొరేట్ కంపెనీలో 374 మంది ఉద్యోగ అవకాశాలు పొందారని అన్నారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి 3 లక్షల నుండి 11 లక్షల వరకు వార్షిక ఆదాయం లభిస్తుందని అన్నారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు డిగ్రీ కోర్సు పూర్తయ్యే లోగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా ముందుకువెళుతున్నమని అన్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా క్యాంపస్ ప్లేస్ మెంట్ సెల్ ఏర్పాటు చేసి ఉపాధికి అనుగుణంగా విద్యార్థులకు స్కిల్స్ పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాలు పొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో పి. జి.కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాసిం షా, పాల్గొన్నారు. అంతకు ముందు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం: సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 42వ డివిజన్ పరిధిలోని శివాలయం సెంటర్‌లో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, 42 వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, 42 వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు శివాజీ ముదిరాజ్, బీజేపీ ఊర్మిళా నగర్ మండల అధ్యక్షులు పడాల కృష్ణ కూటమినేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశ్చిమలోని 22 డివిజన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమినేతలు పత్తి నాగేశ్వరరావు, కూనపురెడ్డి నాగభూషణం, బెన్నాభక్తుల సోమేశ్వరరావు,పత్సవ మల్లికార్జున, బ్రహ్మారెడ్డి, విజయశ్రీ, దొడ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి చేయూత

ప్రజాశక్తి-భవానీపురం: పారా బ్యాడ్మింటన్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అనేక మెడల్స్ సాధించిన క్రీడాకారిణి పడాల రూపదేవికి ఎమ్మెల్యే సుజనాచౌదరి చేయూతనందిస్తున్నారు.



ఇటీవల ఎమ్మెల్యే సుజనాచౌదరిని కలిసిన రూపదేవి తాను సాధించిన విజయాలు, అందుకున్న మెడల్స్‌ను చూపించి తనను మరింతగా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేసింది. సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ సుజనా ఫౌండేషన్ ద్వారా నెలకు రూ.25 వేల చొప్పున ఏడాది పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో గురువారం రూపా దేవికి ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సిబ్బందితో కలిసి రూ 25 వేల రూపాయల చెక్కును రూపదేవికి అందించారు.

కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-కంచికచర్ల: సోనియా, రాహుల్ గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా పెట్టిన ఈడి కేసులకు నిరసనగా



కాంగ్రెస్ ఆధ్వర్యంలో కంచికచర్లలో స్టేట్ బ్యాంక్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని నేషనల్ హెరాల్డ్ కేసులో జాతీయ కాంగ్రెస్ అగ్ర నేతలైన సోనియా రాహుల్ గాంధీ ల పై అక్రమంగా ఈడీ చార్జి సీటు దాఖలు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇటువంటి కేసుల ద్వారా పార్టీని నాయకత్వాన్ని బలహీనపర్చాలని చేస్తున్న మోడీ అమిత్ షా ల కుట్రలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే తిప్పి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందా వజ్రయ్య, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, కంచికచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొట్టూరు రవి బాబు ,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదుల పూర్ణచ్చందరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగం పొందడంతో పాటు మరొకరి ఉద్యోగ అవకాశం కల్పించే స్థాయికి యువత ఎదగాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి.ఆర్‌డిఎ-సీడాప్ సంయుక్తంగా 2025 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో నిర్వహించనున్న జాబ్ మేళాల తేదీలు, నిర్వహించే ప్రదేశాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్ ను ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జాబ్ మేళాను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం లోని "నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్.ఐ.ఆర్.డి ప్రొగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎ.ఎన్.వి.నాంచారరావు, డిస్ట్రిక్ ఎంప్లామెంట్ ఆఫీసర్ వై.ఎస్.బ్రహ్మం, ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ (డి.ఎస్.డి.వో) ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఎ.డి.ఎస్.డి.వో దుర్గాప్రసాద్, సిడాప్ జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్ సుమలత పాల్గొన్నారు.



జాబ్‌మేళా కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎంఎల్‌ఎ

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-నందిగామ

కంచేల గ్రామంలో కల్లాల్లో అరబోసిన ధాన్యాన్ని నందిగామ ఆర్‌డిఓ బాలకృష్ణ గురువారం పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు వరి పంటలకు షెడ్యూలింగ్ చేయాలని, ధాన్యాన్ని ప్రొక్యూర్ చేసుకునేవిధంగా చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కలిపించే మద్దతు ధరకు ధాన్యం విక్రయించేలా రైతులకు అవగాహనా కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ తహసీల్దార్ ఎన్ సురేష్ బాబు, నందిగామ అగ్రికల్చర్ ఏడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గంపలగూడెం

ఊటుకూరు గాంధీ సెంటర్లో మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని మద్యక పంపిణీ చేస్తున్నట్లు వాసవి క్లబ్ ప్రతినిధులు కాజా నాగేందర్ రావు, కే శ్రీనివాస్ రావు తెలిపారు. నిత్యం చల్లని మంచినీటితో పాటు మజ్జిగను కూడా సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

ఎంపిని కలిసిన కోగంటి

ప్రజాశక్తి-కంచికచర్ల: వియవాడ ఎంపి కేశినేని చిన్నిని కంచికచర్ల మండల టిడిపి అద్యక్షుడు కోగంటి బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోగంటి బాబు కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన ఎంపిని గురువారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృత్ణతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపె నాయకులు వేమా వెంకట్రావు, సేక్ షబ్బీర్, అల్లీపాషా, కోగంటి నాని పాల్గొన్నారు.



ఎంపిని సన్మానిస్తున్న కోగంటి

టిడిపితోనే దళితుల అభివృద్ధి : దేవదత్తు

ప్రజాశక్తి-తిరువూరు

దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారని రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికే షన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ అన్నారు. టిడిపి తిరువూరు నియోజక వర్గ కార్యాలయంలో అయన గురువారం విలేకర్ల సమా వేశం నిర్వహించారు. ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీ యమన్నారు. గతంలో రాజీవ్ రంజాన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చి న నివేదికపై కేబినెట్ చర్చించిన ప్రకారం 200 పాయింట్ల రోస్ట ర్ అమలుకు నిర్ణయించిం దని చెప్పారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందనీ దేవదత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఎం వెంకటేశ్వరావు పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ జగజీవన్ రామ్ భవన్ లో గురువారం నిర్వహించిన ఈఎస్ఐ ఆరోగ్య శిబిరానికి కార్మికుల నుండి స్పందన లభించింది. జగ్గయ్యపేట ఇన్చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయదుర్గ, జగ్గయ్యపేట స్టాఫ్ డాక్టర్ షలీనా, విజయవాడ ఈఎస్ఐ హాస్పిటల్ డాక్టర్ శరత్ కుమార్, డిపార్ట్మెంట్ సిబ్బంది స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్, రమేష్ హాస్పిటల్ నుండి ఈసీజీ మరియు రక్త పోటు పరీక్షలు, సెంటర్ ఫర్ సైట్ కంటి ఆసుపత్రి విజయవాడ నుండి కంటి పరీక్షలు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్మికులకు మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి రమణ బాబు మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుందని కార్మికులందరూ మరియు వారి కుటుంబ సభ్యులు ఈఎస్ఐ ప్రయోజనాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ నుండి వచ్చే ప్రయోజనాల గురించి ఈఎస్ఐ హాస్పిటల్ విజయవాడ డెవలప్మెంట్ కమిటీ నెంబర్ పూజారి రాజేష్ అవగాహన కల్పించారు.

